# మోడల్ లవ్ లెటర్స్

(అనగా పోస్టు చేయని ప్రేమ లేఖలు)

---

వెనక "పోస్టుచేయని ప్రేమలేఖలు" అని రాసి అచ్చోసి విడిచి పెట్టినపుడు కంట్రీ నాలుగు మూలలున్నించీ మోడల్ లవ్‌లెటర్స్ కొన్ని రాసిపెట్టమని చాలామంది బోయిస్ అండ్ గరల్స్ నాకు లవ్‌లెటర్స్ రాశారు. కాని అప్పట్లో నాకు (బుర్ర) తిరుగుడు ఎక్కువకావటంవల్ల, తీరిక లేక-మనకి నిఝంగా ఎవరిమీదా లవ్ లేనపుడు ఎవరో నోస్ అండ్ ఫేస్ ముక్కూ—మొగం తెలియని వారికోసం ఏ కాబోయే లేత ఇల్లాలి ఆశల జీవిత కలశంలో కోరికల మంచి ముత్యాలుపోసి నింపటం కోసం. ఆ పారాణిపాదాల అరుణిమను, రక్తినీ అనురక్తినీ నిద్రలేని ఎర్రకలువ రేకులవంటి కన్నులలో చూపించే వయ్యారి బామకోసం - నే నెందుకు కలం పట్టడం అని వూరుకున్నాను.

లవ్‌లెటర్స్ అనేవి ప్రణయంలో వున్నవారికి స్టేట్ సింబల్స్ (అవస్థాచిహ్నాలు) కానివాటి ప్రమేయం లేకుండా లవ్ సిగ్నల్స్ ద్వారా కథ చాలా దూరం వరకూ నడిపించే ప్రవీణులు (ప్రవీణ్‌గారుకాదు) చాలామందే వున్నారు. ఉత్తరాల్లో రిజిష్టర్డ్ లెటర్స్. అన్ రిజిష్టర్డ్ ఆర్డినరీ టపాల్స్ అవి వున్నట్లుగానే ప్రేమల్లో కూడా రిజిష్టర్డ్ ప్రేమ. అన్ రిజష్టర్డ్ ప్రేమ. ఆర్డనరీ ప్రేమ. ఎక్స్‌ప్రెస్ ప్రేమ సర్టిఫికేటాఫ్ పోస్టింగ్ అబ్‌టైన్డ్ ప్రేమా, అవి ఇన్నోటి వెరైటీలున్నాయి.

కాని ఉత్తరాలు డెడ్ లెటరాఫీసుకెళ్ళి తిరిగొచ్చినట్టే కొన్ని ప్రేమలు వారి తాలూకు ప్రేమలేఖలు చుట్టి చుట్టి పొట్లంకట్టి ఎదుట ప్రేమికులు తిరిగి రాసిన వారిదగ్గరకే వచ్చి వ్రాలుతుంటాయి.

ఆర్డినరీ టపాల్సులాగ ఆర్డినరీ ప్రేమ వుంటుందెక్కడో. మనసు లోని మమతల మడతల సందున. కాని పెద్దగా లైఫ్‌మీద రిజిష్టరుకాదు. లోకంలో మెజారిటీ అంతా ఈ బాపతు సరుకే. రిజిష్టరయిన ప్రేమతో



చాలా లావాదేవీలు ఇబ్బందులు వున్నాయి లోకంలో - లోకం అంటే బంధువులూ స్నేహితులూ ఆ మాంబాపతుగాళ్లూ నవలల్లోను సినిమాల్లోనూ కళల్లోనూ కాకరకాయల్లోనూ రిజిష్టరవుతున్న ప్రేమను ఎగ్జాక్టీ యాజిటీజుగా రొటీన్ లైఫ్‌లోకి దింపితే ఆమోదించి అడ్జస్టు కావటానికి సిద్ధంగా లేరు. మన గోత్రం. మన కులం మన దొడ్లోనే ప్రేమ వికసించాలి కాని అడ్డగోలు వ్యవహారం పనికిరాదు. పెళ్ళి చేసుకోండి ముందు తర్వాత లవ్ చేసుకోండి అంటారు. కూల్‌గా కూలింగ్ గ్లాసెస్ సర్దుకుంటూ, మన కంట్రీలో కులగోత్రాలు కట్నాలూ కానుకల జబర్దస్తీలో ప్రేమ అనే తులసిమొక్క ఊపిరాడక ఎండి చక్కాపోతుంది.

కమింగ్ టుది సబ్జట్ - అనగా మోడల్ లవ్ లెటర్సు దగ్గరకొస్తే. పెళ్ళికాని పిల్లలు రాసేవీ, పెళ్ళయాక స్త్రీ ముఖ్యా వద్దాక రాసేవి, కొన్నాళ్ళు పోయాక సంసారంలో పేటరాఫ్ ఫాక్టుగా రాసేవీ అని ప్రణయలేఖలు త్రిగుణాత్మకములు.

"మీ జేబులోంచి ముప్పావలా తీసి పొట్లకాయల వాడికిచ్చాను" అవి చిన్న చీటీమీదరాసి ఆ చీటీని మీ జేబులోకి జారవిడుస్తుందనుకొండి శ్రీమతి అది కేవలం లోకల్ న్యూస్ అయిటం వంటి లెటర్ మాత్రమే.

"ఆరు గంట్లకి పిక్చర్‌కి వస్తారా రారా" అని వ్రాసే చీటీ, బజారుకి వెళ్దాము చీకటిపడకుండా రండి" అని హుకుం జారీచేస్తూ ఏ ఆఫీసుబోయ్ చేతో పంపే కాగితం ముక్క- ఇవి లవ్‌లెటర్స్ కావెంత మాత్రం కాజాలవు.

లవ్‌లెటర్స్‌కి ప్రధానమైన లక్షణం స్త్రీ పురుషుల మధ్య ఎడబాటు. అంటె తగుమాత్రం విషాదం కలిగించే ఎడం. అది ఆషాఢమాసం వలనకానీ. అమ్మాయిని పుట్టింటికి తోలుకువెళ్ళడం వలన కానీ మూడో నెలో. ఐదోనెలో దాటిపోకుండా పువ్వులు ముడిపించటానికిగాని, గాజులు పెట్టించటానికికాని మన ఎగస్‌పార్టీ వాళ్ళు అనగా మగడికి అత్తారూ ఆడదానికి పుట్టింటారూ పోగయితెచ్చే దురవస్థలాంటిదేదో కలిగితీరాలి. విరహం అనేది ప్రకాశించనిదే లవ్‌లెటర్ రాయడం కష్టాతికష్టం. సాధారణంగా మగాళ్ళు లవ్‌లెటర్సూ ఆడాళ్ళు బిజినెస్ లెటర్సూ రాస్తూంటారు.

"ఖమ్మని పూరీలోయ్ బావా-కర కరపేపానోయ్ బావా" అన్నట్లు ఆ బిజినెస్ లెటర్స్‌లోనే ఆడాళ్ళ సాధారణ మిడిల్‌క్లాస్ ప్రమదలు గుత్తి వంకాయ కూరలో మసాలా చేర్చినట్లు తమ వలపును అలా అలా అబిజినెస్ సంగతుల మధ్య చాకచక్యంగా జొప్పిస్తూవుంటారు. మగాళ్ళు చాలా మంది ఇడియట్స్‌కు ఆ కవ్విల్డ్ అన్ అడల్టరేటెడ్ స్టఫ్ (చేతితో తాకని శుద్ధ కమ్మని నెయ్యి) రుచించదు-రుచించదు.

పదివంది మొగుళ్ళను మార్చి, అరడజను ప్రొడ్యూసర్లను మంచంకింద దాచిన మహత్తర సినీతార కులికినట్లు పెళ్ళాం కులకదని వాపోతుంటారు. తెరమీద చూపించినంత ఎగ్జాజరేషన్ అతిశయోక్తి లైఫ్‌లో ఎందుకు? మన జీవితాన్ని వలవ్రవంట చేసుకోవాలనుకోటం లేదు కదా? జీవిత మంటే నూరేళ్ళ పంట కాని నూరు రీళ్ళ సినిమా కాదుకదా!

పేరిన్నెయ్యేసుకుని అవకాయన్నం పెరుగోసుకు తిని లేవలేక వేళ్ళు నాక్కుంటూ ఇంకొంచెం చట్నీ అని ప్లేటును నాకే బ్రతుకులో పరిపూర్ణ చంద్రోదయం ఎలా అవుతుంది అవదండీ సార్-అవదు.

పెళ్ళయ్యాక ఉత్తరాల రూపేణా బోయిస్ అండ్ గరల్స్ మధ్య జరిగే ఉత్తరకాండ ప్రత్యుత్తర కాండలో థ్రిల్ లేదు. థ్రిల్ అంతా బిఫోర్ మ్యారేజీ....పెళ్ళికాకముందు భూమి ఆకర్షణశక్తి కంటే స్త్రీ, ఆకర్షణశక్తి మిలియన్ బిలియన్ టైమ్స్ ఎక్కువగా వుంటుంది. పెద్దవాళ్ళ అమోదముద్ర పొందిన ప్రేమకంటే అమోదముద్ర పొందని ప్రేమ హైవోల్టేజీ బల్బులాగ ధగధగా వెలిగిపోతూ వుంటుంది. అముదం దీపం కళ్ళకు మంచిదే కాని పెట్రోమాక్స్‌లైటు ముందు ఆముదం దీపం చిన్నదే కదా.

దిలైట్ ఆఫ్ లవ్ (ప్రేమజ్యోతి) అంటారే అది ప్రేమికుల కళ్ళలోకిచూస్తే తెలుస్తుంది.

ట్రూ లవ్ రెండుజతల కళ్ళమధ్య, మనో జవంతో పరిగెడుతూ వుంటుంది. నిఝం ప్రేమ డైరెక్ట్ కరెంట్ లాటిది. దీనికి మోడల్ లవ్ లెటర్స్ వున్నా లేకపోయినా ఫరవాలేదు. కాని పాఠకుల సౌకర్యార్థం కొన్ని మోడల్ లవ్‌లెటర్స్ చెప్తాను - వాటినే గతంలో పోస్టుచేయని ప్రేమలేఖలు అని అన్నాను. గుర్తుందా! సిట్‌డౌన్!